# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ యువత ఆలోచనలతో ముందుకు వస్తే పారిశ్రామిక యూనిట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చేయూతనిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- ❖ నీటిని సంరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.
- ❖ సిఐఐ భాగస్వామ్య సదస్సులో సుమారు 9 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరగనున్నాయని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు.
- ❖ మొంథా తుఫాను కారణంగా రాష్ట్రంలో జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని కేంద్ర హోం శాఖ సంయుక్త కార్యదర్శి పౌసుమీబసు తెలిపారు.

======================

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పారిశ్రామిక విధానాలతో యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. ప్రకాశం జిల్లా కనిగిరిలోని పెదఈర్లపాడులో ఎంఎస్ఎంఈ పార్కును ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. అదే విధంగా 17 జిల్లాల్లోని 50 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ... ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి వెల్లువలా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. యువత ఆలోచనలతో ముందుకు వస్తే పారిశ్రామిక యూనిట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చేయూతనిస్తుందని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలని.. వారు మరో 10 మందికి స్ఫూర్తి కావాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

======================

జీవనాధరమైన నీటిని సంరక్షించుకోవలసిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమం శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. గుంటూరులో జాతీయ వాటర్ షెడ్ మహోత్సవాన్ని ఆయన ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ... ఈ కార్యక్రమం ద్వారా చెరువులు

వంటి జలవనరులల్ని పునరుద్ధరిస్తున్నామన్నారు. నీటిని, నేలను సంరక్షించడానికి వాటర్ షెడ్ పథకం, ప్రధానమంత్రి కృషి సించాయి యోజన వంటి పథకాలు దోహదపడతాయన్నారు. ఇవి నీరు, మట్టిని రక్షించటానికి వరప్రదాయినులని, వీటితో రైతులకు ఎంతో లబ్ది చేకూరుతుందన్నారు. అంతే కాకుండా వారి ఉత్పాదకత కూడా పెరుగుతుందని శివరాజ్ సింగ్ చౌహన్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

=======================

మొంథా తుఫాన్ కారణంగా బాపట్ల జిల్లాలో జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని కేంద్ర హోం శాఖ సంయుక్త కార్యదర్శి పాసుమీబసు తెలిపారు. రాష్ట్రంలో మొంథా తుఫాను నష్టాన్ని అంచనా వేసేందుకు పాసుమీబసు నేతృత్వంలో కేంద్ర బృందం బాపట్ల జిల్లాలో ఈరోజు పర్యటించింది. పరిశీలనకు వచ్చిన ఈ బృందానికి జిల్లాలో జరిగిన నష్టాన్ని కలెక్టర్ వినోద్ కుమార్ వివరించారు. నష్టం అంచనాలపై రూపొందించిన 60 పేజీల నివేదికను కలెక్టర్ కేంద్ర బృందానికి అందజేశారు. తాము క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించిన విషయాలను కేంద్రానికి తెలియజేస్తామని, నష్ట పరిహారం కింద అవసరమైన నిధులు వచ్చేలా తమ వంతు కృషి చేస్తామని పాసుమీబసు తెలియజేశారు.

=======================

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఎంఎస్ఎంఈ పార్కుల ప్రారంభోత్సవాలలో భాగంగా , అనంతపురంలోని సిరికల్చర్ ప్రాంగణం ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ కు ఆయన ఈరోజు శంఖు స్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రధానంగా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించాలనే ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈనెల 14, 15 తేదీలలో విశాఖపట్నంలో జరగబోయే సీఐఐ భాగస్వామ్య సదస్సులో దాదాపు 55 దేశాలకు సంబంధించిన మంత్రులు, వ్యాపార బృందాలు పాల్గొంటాయని తెలిపారు. అలాగే దేశంలోని అన్ని రాష్ట్రాల పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడిదారులు వస్తున్నారని, సుమారు 9 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు ఈ సదస్సులో జరగనున్నాయని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

విరామం

=======================

మొంథా తుఫాన్ నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర బృందం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో ఆయన క్యాంప్ కార్యాలయంలో ఈరోజు సమావేశమయ్యింది. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పాసుమీబసు నేతృత్వంలో ఈ బృందం రాష్ట్రంలోని తుపాను ప్రభావిత ప్రాంతాలైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పర్యటించింది. కాగా ఈ తుఫాను కారణంగా 5,267 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఓ మధ్యంతర నివేదికను కేంద్రానికి అందించింది. ఈ మేరకు తక్షణ సహాయంగా 2,622 కోట్ల రూపాయలను మంజూరు చేయాలని కోరింది. రాష్ట్ర వ్యాప్తంగా 443 మండలాల్లోని 3,109 గ్రామాలు మొంథా తుపాను కారణంగా ప్రభావితం అయ్యాయని ఆ నివేదికలో వెల్లడించింది.

=======================

నెల్లూరు నగర శివార్లలోని ఎన్టీఆర్ నగర్ సర్కిల్ వద్ద ఈ రోజు మధ్యాహ్నం లారీ అదుపుతప్పి మూడు బైకులను ఢీ కొనడంతో ముగ్గురు మరణించారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. చేపల లోడ్ తో గూడూరు వైపు వెళుతున్న కంటైనర్ లారీ నియంత్రణ కోల్పోయి ఒక్కసారిగా బైకులపై దూసుకు వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగిందని బాలాజీ నగర్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ కె. సాంబశివరావు తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని వెల్లడించారు.

======================

కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమం శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఈరోజు సమావేశమయ్యారు. ఇటీవల మొంథా తుఫాన్ వల్ల జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ కు వివరించారు. అదే విధంగా మైనర్ ఇరిగేషన్ కింద సాగు చేసే రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందిచాలని కోరారు. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు కలిపి 695 కోట్ల రూపాయలు ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. కేంద్ర ప్రభుత్వ వాటా కింద ఇవ్వాల్సిన 100 కోట్ల రూపాయలను విడుదల చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

======================

విద్యారంగంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ తీసుకువచ్చిన సంస్కరణలు ఎంతో ప్రేరణాత్మకమని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినత్సవ వేడుకలను కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యా శాఖా మంత్రిగా అబుల్ కలాం ఆజాద్ తీసుకువచ్చిన సంస్కరణలు సమాజ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. ఆయన స్ఫూర్తితో ఆనందపురం మండలంలోని పీకేరు గ్రామంలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ముస్లింలకు శ్మశానవాటిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే పెందుర్తిలో భూమి కేటాయింపుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

======================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో పలు చోట్ల రేపు పొడి వాతావరం ఏర్పడే అవకాశముందని వెల్లడించింది. అలాగే కొన్ని చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వివరిస్తూ...

(వాయిస్ 21 సెకన్లు)

======================

గిరిజన హక్కులు, భూముల కోసం పోరాటం చేసిన బిర్సాముండాను ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. ధర్తీ ఆభా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలలలో భాగంగా ఏజెన్సీలోని వివిధ పాఠశాలల విద్యార్థులతో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో ఈనెల 15వ తేదీ వరకు బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రానున్న తరాల వారికి గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేసేందుకు ఈ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

======================
======================